క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



హైదరాబాద్‌లో ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం మర్రి కుంట తండాకు చెందిన ధరావత్ సక్కు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి చికిత్స నిమిత్తం రూ.2లక్షల 50వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేటి నుంచి బొల్లంపల్లిలో గంగదేవమ్మ ఉత్సవాలు



గంగదేవమ్మ ఆలయం

అర్వపల్లి : బొల్లంపల్లి గ్రామంలో యాదవసంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మించిన గంగదేవమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 10 వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం గంపలు, బోనాల ఊరేగింపు, సోమవారం గంగదేవమ్మ కల్యాణోత్సవం, 10న పారువేట కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు, యాదవ సంఘం నాయకులు తెలిపారు. మూడేళ్లకోసారి ఈ ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గోదాల వీరమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించింది. దీంతో శనివారం బీజేపీ నాయకుడు మందడి కృష్ణారెడ్డి మృతిరాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కూర శంకర్, మండల నాయకులు బింగి రమేష్, బుర్ర జనార్దన్, గోదాల అనంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



బూర్గుల సైదులు


నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీ చైర్మన్‌గా బూర్గుల సైదులు, డైరెక్టర్లుగా కొమ్ము సునీత, వంగూరి సంజీవ, తీగుళ్ల యాదగిరి, బుంగ ఇమ్మి, కొమ్ము లింగస్వామి, కన్నెబోయిన రాములు, గుండు సతయ్య, కన్నెబోయిన మహేష్, కొరివి ఉపేందర్ ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్ బూర్గుల సైదులు మాట్లాడారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మందుల సామేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారులకు ప్రత్యేక కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మ, పేరాల వెంకన్న, తీగుళ్ల వెంకన్న, వంగూరి నాగార్జున, కన్నెబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

చివ్వెంల: సూర్యాపేటలో జూన్ 8న జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కమిటీ సభ్యులు పల్లం వెంకట్ రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్‌తోపాటు జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొనే ఈ సభలకు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

డప్పు సుధాకర్ వర్ధంతి

నాగారం : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ జానపద గాయకుడు డప్పు సుధాకర్ ప్రథమ వర్ధంతిని శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు సాంస్కృతిక సారథి సభ్యులు మాట్లాడారు. డప్పు సుధాకర్ ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, చిప్పలపల్లి ఉపేందర్, దున్నపోతుల చంద్రశేఖర్, చిప్పలపల్లి శివ, చిప్పలపల్లి శ్రీకాంత్, గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.



సుధాకర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సాంస్కృతిక సారథి సభ్యులు

మార్కెట్‌ను ముంచెత్తిన చేపలు

నేడు మృగశిర కార్తె ఆరంభం

- విక్రయాలకు చేపలను సిద్ధం చేసిన వ్యాపారులు
- ముందు రోజు నుంచే ప్రారంభమైన కొనుగోళ్లు





సూర్యాపేట మార్కెట్‌లో చేపలను అమ్ముతున్న వ్యాపారులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మృగశిర కార్తె అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ప్రారంభం రోజున చేపలు తినడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తె వచ్చిందంటే దాదాపుగా వేసవి కాలం ముగుస్తూ వానాకాలం మొదలవుతుందని భావన. ఈ నేపథ్యంలో మృగశిర కార్తె మొదటిరోజు చేపలు తింటే మంచిదని ప్రజలు నమ్ముతారు. మృగశిర కార్తె సందర్భంగా సూర్యాపేట పట్టణంలో సుమారుగా 15 నుంచి 20 టన్నుల వ్యాపారం జరుగుతుందని చేపల వ్యాపారులు తెలుపుతున్నారు. ఈ క్రమంలో మొత్తంగా జిల్లాలో 100 టన్నులకు పైచిలుకు చేపల అమ్మకాలు జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

టన్నుల కొద్దీ చేపలు..

మృగశిర కార్తె రోజు చేపలు తినడానికి ప్రాధాన్యం ఇస్తుండటంతో ఒకే రోజు అన్ని టన్నుల చేపలు లభ్యం కావడం అసాధ్యం. దీంతో కొంత మంది వ్యాపారులు గుత్తకి తీసుకున్న చెరువుల నుంచి కావాల్సిన చేపలను సమకూర్చుకుంటారు. కొంత మంది వ్యాపారులు, మత్స్యకారులు, విక్రయదారులు మాత్రం ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున చేపలను దిగుమతి చేసుకుంటున్నారు. నేడు మృగశిర కార్తె ఆరంభం రోజు కావడంతో ఇప్పటికే వ్యాపారులు టన్నుల కొద్దీ చేపలను సిద్ధం చేశారు.

కార్తె రోజు చేపలకు డిమాండ్



మృగశిర కార్తె వచ్చిందంటే ఆ రెండు రోజులు చేపలు బాగా అమ్ముడుపోతాయి. మామూలు రోజుల్లో అయితే చేపలు కొంటే మేమే కటింగ్ చేసి ఇస్తాం. దానికి అయ్యే రూ.30లు మేమే భరిస్తాం. కానీ మృగశిర రోజు మాత్రం చేపలు అమ్మడానికే సమయం సరిపోదు. పోయిన ఏడాది కార్తె రోజు 3 క్వింటాళ్ల చేపలు అమ్మాను. ఈసారి కూడా రెట్టింపు చేపలు దిగుమతి చేసుకున్నాను.

\- మారిపెద్ది గణేష్, చేపల వ్యాపారి, సూర్యాపేట

చేపలు తింటే మంచిదని..



మృగశిర కార్తె రోజు చేపలు తినడం అలవాటు. ఈ రోజు చేపలు తింటే మంచిదని పెద్దలు చెప్తుంటారు. నా చిన్నప్పటినుంచి ఆనవాయితీగా ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజున మా ఇంట్లో చేపలు తింటూనే ఉన్నాం. చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని.. ఉబ్బసం, గుండె జబ్బులు లాంటి అనారోగ్య సమస్యలు రాకుండా దూరమవుతాయని నమ్మకం.

\- జానిమియా, నూర్ బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి, సూర్యాపేట

రోడ్డును కమ్మేస్తున్న కంపచెట్లు



కాసరబాద్ నుంచి ఇమాంపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట దట్టంగా కంపచెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సూర్యాపేట మండల పరిధిలోని కాసరబాద్ నుంచి ఇమాంపేటకు వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీనికి తోడు ఆరోడ్డులో మూలమలుపులు ఎక్కువగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చొరవ చూపి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

కంఠమహేశ్వర సురమాంబదేవి కల్యాణం



శ్రీకంఠమహేశ్వరస్వామి సురమాంబదేవి కల్యాణం నిర్వహిస్తున్న గౌడశెట్టి పూజారులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలో శ్రీకంఠమహేశ్వర దేవాలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం శ్రీకంఠమహేశ్వర సురమాంబ దేవి కల్యాణ మహోత్సవాన్ని గౌడశెట్టి పూజారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడకులస్తులు మాలధారణతో దేవాలయం వద్దకు గంపలు ఎత్తుకొచ్చారు. రాత్రి గ్రామంలో కంఠమహేశ్వరసురమాంబ దేవి విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీ కంఠమహేశ్వర దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



అర్వపల్లి : కోమటిపల్లిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



తిరుమలగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు ఇస్తున్న ఉపాధ్యాయులు



నూతనకల్ : పెద నెమిలలో బడిబాట ప్రచారం..

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కోమటిపల్లి మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, పాఠశాల ఏఏపీసీ చైర్‌పర్సన్ షేక్ శమీన అన్నారు. గ్రామంలో శనివారం బడిబాట ర్యాలీ జరిపి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉల్లెందుల సైదులు, ఉపాధ్యాయురాలు ఆర్. సృజన, అంగన్‌వాడీ టీచర్ పి. శివరంజని, మాంద్ర లింగయ్య, రవి, పద్మ, వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తిరుమలగిరి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్ కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలో పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. అనంతరం గ్రామంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమయ్య, వెంకన్న, సత్తిరెడ్డి, జానయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

నూతనకల్ : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ శివయ్య అన్నారు. శనివారం పెద నెమిలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చవగాని వెంకయ్యగౌడ్, కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి తవ్వకాలను నిలిపివేయాలి



అక్రమంగా టిప్పర్ల ద్వారా తరలిస్తున్న మట్టి

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామ శివారులోని ముత్యాలమ్మకుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్ మాతంగి వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వీఎస్‌ఎంఆర్ కన్‌స్ట్రక్షన్ వారు ఎలాంటి అనుమతి లేకుండా చెరువులోని మట్టిని తరలించి వినియోగిస్తున్నారని తెలిపారు. చెరువులో ఏర్పడిన భారీ గుంతల వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో జోరుగా బట్టీల దందా..



ఆత్మకూరు మండల పరిధిలోని ఓ బొగ్గు బట్టీ వద్ద ఉన్న వేప మొద్దులు



ముక్కుడుదేవులపల్లిలో ఇటుక బట్టీ వద్ద పోసి ఉంచిన నల్లరేగడి మట్టి

- బొగ్గు బట్టీలకు చెట్ల నరికివేత
- అక్రమంగా చెరువు మట్టి తరలిస్తూ ఇటుక బట్టీల వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండలంలో ఇటుక బట్టీలు, బొగ్గు బట్టీల దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. పచ్చని చెట్లు, భారీ వృక్షాలు బొగ్గు బట్టీలలో బూడిద అవుతుండగా.. రైతుల పంటపొలాలకు ఉపయోగపడాల్సిన చెరువు మట్టి ఇటుక బట్టీలకు ముడిసరుగా మారుతోంది. ఈ దందాలతో లక్షల రూపాయలు చేతులు మారుతున్నా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో దాదాపు రెండు బట్టీల చొప్పున ఉన్నాయి. బొగ్గు బట్టీల నిర్వాహకులు వేప, తుమ్మలాంటి పలు రకాల చెట్లను నరికి ఉపయోగిస్తున్నారు. చెట్లను పరిరక్షించాల్సిన ఫారెస్ట్ అధికారులు మాత్రం బొగ్గుబట్టి నిర్వాహకుల వద్ద నెలవారీ మామూళ్లు తీసుకుంటూ సరిపెట్టుకుంటున్నారని, దీంతో బొగ్గు బట్టీల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

ఇటుక బట్టీలకు మట్టి తరలింపు..

మండలంలో నల్ల మట్టి దందా కూడా జోరుగా సాగుతోంది. కొందరు బయట వ్యక్తులు ఇక్కడి రైతుల భూములు తీసుకొని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పాత సూర్యాపేట, పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం, ఏపూరు, దాచారం, ఏనుబాముల తదితర గ్రామాలలో నిర్వహించే ఇటుక బట్టీలకు ఆయా గ్రామాల చెరువుల్లోని నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. దీనిపై పలు గ్రామాల రైతులు, యువకులు అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయినా కొన్ని శాఖల అధికారులు మామూళ్లు తీసుకుంటూ ఇటుక బట్టీల వ్యాపారులకు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి ఇటుక బట్టీలు, బొగ్గుబట్టీల నిర్వహణపై చర్య తీసుకొని ప్రజా సంపద దుర్వినియోగం కాకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

చెట్ల నరికివేతను అరికట్టాలి

మండలంలో అన్ని రకాల చెట్లను నరుకుతూ బొగ్గు బట్టీలకు వాడుతున్నారు. దీంతో భారీ వృక్షాలు సైతం బొగ్గుబట్టీల పాలవుతున్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా బొగ్గు బట్టీలు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్ల నరికివేతను అరికట్టాలి.

\- దంతూరి సోమన్న

త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్‌ను ముస్లింలు శనివారం సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలతోపాటు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో ముస్లింలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేటలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నాగారం : శాంతినగర్‌లో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐ ఐలయ్య





సూర్యాపేటలో ఈద్గా వద్ద ముస్లిం పెద్దలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, తదితరులు



అర్వపల్లి శివారులోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



నాగారం : శాంతినగర్‌లో..



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో ఈద్గా వద్ద..



పెన్‌పహాడ్ : అనంతారంలో ఈద్గా వద్ద..



అర్వపల్లి : కుంచమర్తి శివారులోని ఈద్గాలో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

సూర్యాపేట అర్బన్ : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం 6వ రోజు సూర్యాపేట పట్టణంలోని 6వ వార్డు దాసాయిగూడెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల వారు తమ ఇళ్లలోని తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. వీధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పెంపుడు కుక్కల మెడకు బెల్ట్‌లు వేయాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల వారికి నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, యాదగిరి, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వార్డ్ అధికారి ధరావత్ నవీన్, వసీం పాల్గొన్నారు.

గ్రూప్-3 ఉద్యోగానికి ఎంపిక



బానోతు హుస్సేన్

అర్వపల్లి : మండలంలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన బానోతు బాలునాయక్-మల్లెపువ్వుల రెండో కుమారుడు బానోతు హుస్సేన్ గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఎస్టీ కేటగిరిలో 90వ ర్యాంక్ సాధించారు. ఆడిట్, ఫైనాన్స్, ట్రెజరీ డిపార్ట్‌మెంట్లలో ఏదైన ఒకదానిలో చేరనున్నట్లు హుస్సేన్ శనివారం తెలిపారు. కాగా హుస్సేన్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్‌లో గత పదేళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు..

నాగారం : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎడ్ల ఆర్యన్, మార్గం శ్రీతన్, ధరావత్ శరత్‌లు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి. చంద్రబాబు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను రూ.48వేలు స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.

నరేష్‌నాయుడుకు సన్మానం



సన్మానిస్తున్న యూత్‌క్లబ్ సభ్యులు

అర్వపల్లి : బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బీజేవైఎం మండల అధ్యక్షుడు నల్లగుంట్ల నరేష్‌నాయుడును శనివారం తిమ్మాపురం గ్రామంలో నేస్తమా యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేస్తమా యూత్ ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, సభ్యులు బింగి బాలరాజు, ఆదె మధుకర్, కాలేరు వెంకట్, మామిళ్ల లింగస్వామి, బొడ్డు మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మునగాల: జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త సమాయత్తం కావాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా గ్రామగ్రామాన దిమ్మెలు నిర్మించాలనే లక్ష్యంపై సోమవారం కోదాడలో జరిగే ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

మునగాల : మండల వ్యాప్తంగా 2024- 25 విద్యా సంవత్సరంలో అత్యధిక పాఠశాలలను పర్యవేక్షించిన (సందర్శన) ఎంఈఓగా స్థానిక మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు నిలిచారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లును ఎస్‌ఈఆర్టీ డైరెక్టర్ రమేష్, ఆర్‌జేడీ విజయలక్ష్మి శనివారం సత్కరించారు.